సాక్షి ఒడిశా
శనివారం, 12, జూలై, 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 6,60,699
వెండి : 15 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



అక్రమ నివాసాల కూల్చివేత

జయపురంలో అక్రమ నివాసాలు కూల్చేశారు. గుడిసెలు తీసేశారు.
- 8లో



బైక్ అదుపు తప్పి..

బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరు గాయపడ్డాడు.
- 8లో

మంత్రి మండలి విస్తరణపై.. ఊహాగానాలు

- సిట్టింగులకు గుండె దడ
- కొత్తవారిలో ఉత్సాహం



భువనేశ్వర్: రాష్ట్ర మంత్రి మండలి విస్తరణ శుభ ఘడియల కోసం పలువురు ఆశావాదులు ఉవ్విళ్లూరుతున్నారు. మన్మోహన్ సామల్ మరో మారు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన మరుక్షణం నుంచి మంత్రి మండలి విస్తరణపై ఉత్కంఠ బిగుసుకుంది. రాష్ట్రంలో తొలి సారిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో మన్మోహన్ సామల్ కీలక పాత్ర పోషించి అధిష్టానం మన్ననలు పొందారు. ప్రభుత్వం ఏర్పాటు తర్వాత కూడా ఆయన దక్షతని ప్రత్యక్షంగా చాటుకున్నారు. బీజేపీ ఏడాది పాలన కాలంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏడాది పాలనలో ఒడిదొడుకుల్ని సవరిస్తూ ప్రభుత్వంలో, సొంత పార్టీలో లుకలుకల్ని పరిష్కరించిన అనుభవజ్ఞుడిగా మంత్రి మండలి విస్తరణకు వ్యూహాత్మకంగా రూపొందిస్తారనే నమ్మకం సర్వత్రా నెలకొని ఉంది.

వాస్తవానికి మోహన్ చరణ్ మాఝి కొలువులో 6 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. పలువురికి బహుళ శాఖలు కేటాయించారు. బాధ్యతల ఒత్తిళ్లతో కొన్ని శాఖల పని తీరు సంతృప్తికరంగా కొనసాగడం లేదు. కీలకమైన శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న వారి నుంచి బహుళ శాఖల బాధ్యతల్ని తొలగించి పాలన దక్షతనకు పదును పెట్టి రాష్ట్ర బహుముఖాభివృద్ధికి నడుం బిగించాల్సిన సమయంలో స్ఫూర్తిదాయకమైన మంత్రి వర్గాన్ని మన్మోహన్ సామల్ ఆవిష్కరిస్తారని సర్వత్రా చర్చ సాగతుంది.

మరో వైపు మంత్రులుగా శాఖల కార్యాచరణ, అనుబంధ పురోగతి నామ మాత్రంగా కొనసాగుతున్న వారి వైపు దృష్టి సారించే అవకాశం ఉంది. ఏడాది పాలనలో సంతృప్తికరమైన పురోగతి లేని శాఖల్లో అమాత్యుల మార్పు అనివార్యం అనిపిస్తోంది. పాత ముఖాల్ని తొలగించి ప్రభుత్వ ఆశయాల వాస్తవ కార్యాచరణ పట్ల అంకిత భావంతో ఔత్సాహికంగా ముందుకు వస్తున్న వారిలో కొంత మందికి విస్తరణలో చోటు ప్రసాదించేందుకు అనుకూలత నెలకొని ఉంది.

బీజేపీ ఏడాది స్వల్ప వ్యవధి పాలనలో ఆరోగ్య, న్యాయ శాఖలు వివాదాస్పదమయ్యాయి. ప్రధానంగా పూరీ శ్రీ జగన్నాథుని రథ యాత్ర నిర్వహణ తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది. ఏడాది వ్యవధిలో వరుసగా 2 సార్లు నిర్వహించిన జగన్నాథుని రథ యాత్రలో పలు అపశృతులు చోటు చేసుకున్నాయి. శ్రీ మందిరానికి భద్రత లోపించిది. స్వామి భక్తులకు రక్షణ కొరవడిందనే ఆరోపణలు రాష్ట్రేతర ప్రాంతాలకు వ్యాపించాయి. ఇలాంటి అవమానకర పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకుని మంత్రి మండలి సంస్కరణలకు శ్రీకారం చుట్టాల్సి ఉందని విశ్లేషకులు హితవు పలుకుతున్నారు.

ఖాళీ స్థానాల భర్తీపై ఉత్సాహం ఉరకలేస్తుండగా ఉద్వాసనకు చేరువలో ఉన్న వారికి గుండె దడ పెరుగుతోంది. ఇటీవల ఏడాది పాలన పూర్తి పురస్కరించుకుని పలు శాఖలు, మంత్రుల పని తీరు, పురోగతి వగైరా సమాచారం ముందస్తుగా సేకరించి విశ్లేషించారు. ఈ విశ్లేషణ ఆధారంగా పలు శాఖల్లో పెను మార్పులు చోటు చేసుకోవడం తథ్యం. మంత్రి వర్గ విస్తరణ, కొత్త వారికి పదవుల కేటాయింపు విషయాల్లో ప్రభావ వంతుల ప్రమేయానికి కళ్లెం పడుతుందని మన్మోహన్ సామల్ సన్నిహిత వర్గాల భోగట్టా. అధికార పార్టీ పరువు, ప్రతిష్టల్ని వీధికి ఈడ్చిన సంఘటనల తెర వెనక ప్రముఖుల చొరవకు అడ్డుకట్ట వేసి వికసిత్ ఒడిశా ఆశయ సాధనకు సానుకూల మంత్రి మండలి ఏర్పాటుకు మార్గం సుగమం చేసే యోచన తుది మెరుగులు దిద్దుకుంటుది.

లింగ, కులం, ప్రాంతీయ ప్రాతిపదికన మంత్రి మండలిలో స్థానం కల్పించే సమీకరణాలపై గణాంకాలు కొనసాగుతున్నాయి. ప్రజాదరణ, విద్యాధికృత, వ్యూహాత్మక సమన్వయం ప్రామాణికలతో మహిళలు ఇతర వర్గాలకు పట్టం గట్టే అవకాశం ఉంది. అన్ని లోక్ సభ నియోజక వర్గాల నుండి రాష్ట్ర మంత్రి మండలి ప్రాతినిధ్యంపై దష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది.

బోర్డులు, కార్పొరేషన్లకు నియామకాలు

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన పలు ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, అకాడమీలు, కమిషన్లు వగైరా సభ్యుల నియామకం నోచుకోలేదు. మంత్రి మండలి విస్తరణతో ఆయా పదవుల్ని భర్తీ చేస్తారని భావిస్తున్నారు. పార్టీ అంతర్గత పోటీ ప్రభావంతో ఈ పదవుల భర్తీలో జాప్యం చోటు చేసుకున్నట్లు సమాచారం.

ముఖ్యమంత్రి యథాతథం

రాష్ట్ర ముఖ్యమంత్రిగా మోహన్ చరణ్ మాఝి యథాతథంగా కొనసాగుతారని ఇటీవల ఒక సందర్భంలో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ప్రకటించారు. ఈ ప్రకటన వీరివురి మధ్య సమన్వయం, సమభావన యోచనల్ని ప్రతిబింబిస్తుంది. రథ యాత్రలో గందరగోళం, భువనేశ్వర్ నగర పాలక సంస్థ అధికారిపై దాడి వంటి సంఘటనల వెనక ప్రభావవంతమైన గ్రూపు నాయకులను పక్కన పెట్టి అధ్యక్షుడు మన్మోహన్ సామల్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మంత్రి మండలి విస్తరణ, ప్రభుత్వ రంగ సంస్థల సభ్యుల నియామకంలో ఒక ప్రధాన నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తుంది. మోహన్ చరణ్ మాఝికి ముఖ్యమంత్రిగా పట్టం గట్టడంతో ఆది నుంచి ఒక వర్గం సమస్యాత్మక పరిస్థితుల్ని ప్రేరేపించి అవాంఛనీయ అలజడి రేపుతున్నట్లు సాగుతున్న ప్రచారంపై పార్టీ అధిష్టానం దృష్టిని కేంద్రీకరించింది.

న్యూస్‌రీల్

రాష్ట్రపతి భద్రతా ఏర్పాట్లపై సమీక్ష



భద్రతా ఏర్పాట్లు సమీక్షిస్తున్న డీజీపీ యోగేష్ బహదూర్

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఈనెల 15న కటక్ నగరంలో జరిగే వివిధ కార్యక్రమాలకు హాజరవుతారు. రాష్ట్రపతి పర్యటన పురస్కరించుకుని కటక్, భువనేశ్వర్ జంట నగరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా ఆయా ప్రదేశాలను ప్రత్యక్షంగా సందర్శించి క్షేత్రస్థాయిలో భద్రత మరియు ట్రాఫిక్ ఏర్పాట్లను సమీక్షించారు. డీజీపీతో పాటు భువనేశ్వర్, కటక్ జంట నగరాల పోలీస్ కమిషనర్, కటక్ జిల్లా మేజిస్ట్రేట్, కటక్ నగర డీసీపీ, ఇతర సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ రోహింగ్యాల గుర్తింపు ప్రారంభం



ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో రాయిఘర్ సమితిలో బెంగాలీ శరణార్థ గ్రామాల్లో బంగ్లాదేశ్ రోహింగ్యాల గుర్తింపు ప్రారంభమైంది. శుక్రవారం ఆ ప్రాంతంలో 59 మంది చొరబాటుదారులు ఉన్నట్లు ప్రభుత్వానికి సమాచారం వచ్చింది. వీరు 1971కి ముందు ఈ ప్రాంతానికి వచ్చినట్లు ప్రభుత్వ నివేదికల్లో ఉంది. అందులో పది మందిని రాయిఘర్ పోలీస్ స్టేషన్ పిలిపించారు. వారి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. వీరు చాలా కాలంగా ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. కానీ పోలీసులు గుర్తించిన వారు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారే కానీ రోహింగ్యాలు కాకపోవడం విశేషం.

వృద్ధులకు దుస్తులు పంపిణీ



వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక బ్యూటీపార్లర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తుంబిగుడ వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ మిశ్రో నేతృత్వంలో సంఘం సభ్యులు వృద్ధాశ్రమంలో ఉంటున్న మహిళలకు చీరలు, పురుషులకు లుంగీ, టవల్‌లు అందజేశారు. ప్రతీ ఏడాది ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. సంఘం సభ్యులు సంక్షేమ నిధికి విరాళాలు అందిస్తుంటారని, అందులో కొంతభాగంగా ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుంటామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి శైలసూత సాహు, ఉపాధ్యక్షురాలు శివానీ పలక తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితులు

కొరాపుట్: మూడు వేర్వేరు ఘటనల్లో 27 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి పంథాలుంగ్ గ్రామ పంచాయతీ పరిధి జయంతిగిరి, చెటోడిపుట్ గ్రామాల్లో ఎక్సైజ్ సిబ్బంది శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో గంజాయితో పాటు 12 లీటర్ల దేశీ మద్యం పట్టుబడింది. దీంతో సిర్మే ఖొరా, జయరాం పంగి, బల్కి పంగి అనే వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ రథ్ ప్రకటించారు.

విప్ప పువ్వు స్వాధీనం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి గోరఖ్‌పూర్ గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నాటుసారా తయారీకి వినియోగించే విప్పపువ్వు బస్తాలను ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గోరఖ్‌పూర్‌లో నివసిస్తున్న జేఎస్ సాహు అనే వ్యక్తికి చెందిన గోదాంలో విప్పపూవును నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ సిబ్బంది దాడులను నిర్వహించారు. దాడుల్లో ఎంత మొత్తం విప్పపువ్వు స్వాధీనం చేసుకున్నది తెలియజేయలేదు. నిందితుడు సాహును అదుపులోని తీసుకున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యే నియోజక వర్గంలో విపక్ష సభ్యుల ఆందోళన



నీలగిరి ప్రాంతంలో బీజేడీ మహిళల ఆందోళన



నీలగిరి ప్రాంతంలో బీజేడీ నిరసన సభ



నిరసన సభకు హాజరైన ప్రజలు

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ నీలగిరి నియోజక వర్గం ఎమ్మెల్యే సంతోష్ ఖటువా అరెస్టు డిమాండ్‌తో ఆందోళన క్రమంగా ఉద్ధృతం అవుతుంది. బిజూ జనతా దళ్ మహిళా నాయకురాలి పట్ల అసభ్య పదజాలంతో అవమానకర అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణ. సిటింగ్ ఎమ్మెల్యే అరెస్టు నినాదంతో ఆయన సొంత నియోజక వర్గం నీలగిరి ప్రాంతంలో శుక్రవారం నిరసన సభ నిర్వహించారు. పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ ఖటువా దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. బిజూ మహిళా జనతా దళ్ అధ్యక్షురాలు స్నేహాంగిని చురియా, మాజీ మంత్రి సుదాం మరాండి, జిల్లా అధ్యక్షులు జ్యోతి ప్రకాష్ పాణిగ్రాహి, ఎమ్మెల్యేలు అశ్విని కుమార్ పాత్రో, సంజీవ్ మల్లిక్, బిజూ యువ జనతాదళ్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బ్యోమకేష్ రాయ్ తదితర ప్రముఖ కార్యకర్తలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

• నాగలికి ప్రేమికులను కట్టి..



ప్రేమికులిద్దరినీ నాగలికి కట్టి దున్నిస్తున్న గ్రామస్తులు

రాయగడ: ప్రేమ వివాహం చేసుకున్న ఇద్దరిని ఊరు వెలి వేసింది. అంతే కాదు గ్రామ పెద్దలు గ్రామసభలో వారికి దండన విధించారు. ఇద్దరినీ నాగలికి రెండువైపులా కట్టి పొలం దున్నే పనులు చేయించారు. పొలం దున్నే సమయంలో ఇద్దరినీ కర్రలతో కొట్టారు. ఈ అవమానకర ఘటన జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి సికరపాయి సమితి కొంజొమాజొడి గ్రామంలో వారం కిందట జరిగింది. దీనికి సంబంధించిన వీడియో శుక్రవారం నాడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతొ విషయం బయటకు పొక్కింది.

వివరాల్లోకి వెళితే... కొంజొమాజొడి గ్రామంలో లక సరక (27) అనే యువకుడు అదే గ్రామంలో కొడియా సరక (32) లు నివసిస్తున్నారు. వరుసకు కొడియా సరక లక సరకకు పిన్ని అవుతుంది. అయితే ఇద్దరి మధ్య గత కొన్నాళ్లుగా ప్రేమ వ్యవహారం కొనసాగుతుంది. ఇద్దరూ ఇష్టపడ్డారు. ప్రేమించుకున్నారు. అనంతరం కొద్ది రోజుల క్రితం ఇద్దరూ ఊరు విడిచి బయటకు వెళ్లి వివాహం చేసుకున్నారు. విషయం గ్రామస్తులకు, గ్రామ పెద్దలకు తెలిసింది. ఇద్దరిని గ్రామానికి రప్పించారు. గ్రామ సభను నిర్వహించారు. గ్రామ కులదేవత వద్ద ఇద్దరికీ స్నానం చేయించారు. గ్రామ కట్టుబాట్లను కాలరాసినందుకు దండన విధించారు. వెదురు కర్రలతొ రూపొందించిన నాగలికి రెండు వైపులా ఇద్దరిని అందరి సమక్షంలో కట్టి ఎద్దులను కొట్టినట్టు కొట్టి పొలం దున్నే పనులను చేయించారు. అనంతరం వారిని ఊరి నుండి వెలివేశారు. విషయం బయటకు పొక్కడంతో గ్రామానికి చేరుకున్న విలేకరులకు కొందరు విషయం చెప్పారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సత్యసాయి భక్తులు

జయపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సత్యసాయి భజన మండలి సభ్యులు అన్నారు. దీనిలో భాగంగా బొరిగుమ్మ సమితి దుర్లగుడలోని షిరిడీ సాయి మందిర ప్రాంగణంలో మొక్కలను శుక్రవారం నాటారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ శరత్ దాస్, ఎస్.సాయి, శివ మహంతి, కృష్ణచంద్ర పండ, బాలమ్మ, అనూరాధ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బొరిగుమ్మ సమితి బెనగాం ప్రాజెక్టు ఉన్నత పాఠశాల పరిసరాల్లో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఆర్‌సీసీ ప్రఫుల్ల కుమార్ నాయిక్, హెచ్ ఎం శ్రీకాంత కుమార్ పండ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



వ్యాస రచన పోటీలకు హాజరైన విద్యార్థినులు

పర్లాకిమిడి: ఒడిశా సాహిత్య అకాడమీ స్వర్ణోత్సవాలు పురస్కరించుకొని స్థానిక మహేంద్రగిరి పుర పాలక ఉన్నత పాఠశాలలో ప్రబంధాలు, వక్తృత్వ, కవితాపఠనం, సాహిత్యం, జనరల్ నాలెడ్జిపై జిల్లా స్థాయి పోటీలు శనివారం నిర్వహించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ఉపాధ్యాయులు బినోద్ చంద్ర జెన్నా, ఉపాంత ప్రహరి పూర్ణచంద్ర మహాపాత్రో, విశ్రాంత హెచ్‌ఎం శ్వేతా పట్నాయక్, బిచిత్రా నంద బెబర్తా, బినోదిని సైన్సు కళాశాల అధ్యక్షుడు మనోజ్ పట్నాయక్, మహిళా స్నాతక ఉన్నత విద్యాలయం అధ్యాపకులు భారతీ పాణిగ్రాహి, ఒడియా అధ్యాపకురాలు డా.చారుప్రభానాయక్, ఉపాధ్యాయులు శ్యాం సుందర గంతాయత్, శశి భూషణ్ పట్నాయిక్ తదితరులు వ్యవహరించారు.

మొరాయిస్తున్న ముఖ్యమంత్రి హెలికాప్టర్

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి హెలికాప్టర్ గత నెల రోజులుగా కేంద్రాపడాలో ఒక కళాశాల ప్రాంగణంలో మొరాయిస్తోంది. పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు రాత్రింబవళ్లు దీనికి కాపలా కాస్తున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్ తరలింపుపై స్థానికులు నిరీక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ కేంద్రాపడా అటానమస్ కాలేజీ మైదానంలో చిక్కుకుపోయింది. పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది దానికి కాపలాగా ఉన్నారు. జూన్ నెల 9న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి కేంద్రాపడా సందర్శించి త్రిరంగ యాత్ర, తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ రోజు మెరుపులతో భారీ వర్షం కురిసింది. మెరుపు దాడికి హెలికాప్టర్ రెక్కలు (ప్రొపెల్లర్) దెబ్బతినడంతో కదలకుండా మొరాయించింది. ముఖ్యమంత్రి కేంద్రాపడా నుంచి కారులో తిరిగి వెళ్లారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక సాంకేతిక బృందం వచ్చి హెలికాప్టర్‌ను మరమ్మతు చేసి పునరుద్ధరించడంతో తొలగించడం జరుగుతుందన్నారు. నెల రోజులు పూర్తి అయిన ఈ మేరకు చర్యలు శూన్యంగా తారసపడుతున్నాయి. భద్రతా కారణాల దృష్ట్యా హెలికాప్టర్‌కు పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది 24 గంటలు కాపలాగా ఉన్నారు.

జర్నలిస్టుల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఎమ్మెల్యే రూపు భొత్రకు స్వాగతం పలుకుతున్న జర్నలిస్టులు

జయపురం: జర్నలిస్టుల కోసం జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితి కేంద్రంలో భవనాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు చేయనున్నట్లు కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర ప్రకటించారు. గురువారం సాయంత్రం కుంద్రను సందర్శించిన సందర్భంగా ఆయన్ని జర్నలిస్టు అసోసియేషన్ సభ్యులు కలిసి సత్కరించారు. జర్నలిస్టు భవనానికి తగిన స్థలం ఎంపిక చేసి కేటాయించాలని ఎమ్మెల్యే రూపు భొత్ర కుంద్ర తహసీల్దార్ బినోద్ చంద్ర నాయిక్‌ను ఆదేశించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను అమీన్, రెవెన్యూ సూపర్‌వైజర్లను స్థలం ఎంపిక బాధ్యతలను అప్పగించారు. అనువైన స్థలం గుర్తిస్తామని తహసీల్దార్ శాసనసభ్యుడుకి హామీ ఇచ్చారు. సెప్టెంబర్‌లోగా జర్నలిస్టు భవనానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన కుంద్ర సమితి ప్రాంతంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తనకు తెలియజేయాలని ఆయన జర్నలిస్టులకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి తాను కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్ ప్రహరాజ్, కార్యదర్శి హరిష్ బెహర, సహాయ కార్యదర్శి సురేంద్ర సాగరియ, సలహాదారు అక్షర కుమార్ పట్నాయక్, న్యాయ సలహాదారు కనుచరణ నాయిక్, జర్నలిస్టులు వీర కిశోర్ శర్మ, బాబుల హరిజన్ ఉన్నారు.

పోలీసు వాహనాన్ని ఢీకొట్టిన బైకిస్టు

- కానిస్టేబుల్, బైకిస్టుకు గాయాలు



గాయపడిన బైకిస్టు ప్రఫుల మడకామి

జయపురం: ఛతీస్‌గఢ్ రాష్ట్ర పోలీసు వాహనాన్ని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైకిస్టుతోపాటు కానిస్టేబుల్ గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకోవడానికి ఛతీస్‌గఢ్ రాష్ట్రం సుకుమ జిల్లా టుంప పోలీసుస్టేషన్ సిబ్బంది కొద్దిరోజులుగా ప్రయత్నిస్తున్నారు. ఇంతలో ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడు అరుకులో ఉన్నట్లు తెలుసుకున్నారు. వెంటనే వారు కొరాపుట్ జిల్లాకు వచ్చి సెమిలిగుడ పోలీసుల సహకారంతో నిందితుడుని పట్టుకోగలిగారు. అతడిని బొయిపరిగుడ, మల్కనగిరిల మీదుగా సుకుమకు తీసుమకు గురువారం రాత్రి తీసుకెళ్తున్నారు. రాత్రి పది గంటల సమయంలో బోయిపరిగుడలోని పెట్రోల్ పంపు సమీపంలోని డాబా హోటల్ వద్ద భోజనాలు చేసేందుకు వెళ్తున్న సమయంలో బలిగుడ గ్రామానికి చెందిన ప్రఫుల్ల మడకామి ద్విచక్ర వాహనంపై రామగిరి గ్రామం నుంచి వస్తూ పోలీసు వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో బైకిస్టు ప్రఫుల్ల మడకామి, పోలీసు వాహనం డోర్ పక్కన కూర్చున్న పోలీసు హవల్దార్ అరేంద్ర యాదవ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం తెలిసిన బొయిపరిగుడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. హవల్దార్ చెవికి పెద్ద గాయమవ్వగా.. ప్రఫుల్ల మడకామికి తలపై బలమైన గాయమైంది. ప్రాథమిక చికిత్స తరువాత ప్రఫుల్లను జయపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. పోలీసు కానిస్టేబుల్ అరెంద్ర యాదవ్ ను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమ జిల్లా టుంపకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ విదేశీ మద్యం పట్టివేత

- నలుగురి అరెస్టు



అరెస్టయిన నిందితులు, స్వాధీనం చేసుకున్న నకిలీ విదేశీ మద్యంతో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: కొరాపుట్ జిల్లాలో దేశీయ సారా, కల్తీ విదేశీ మద్యం వరదలై పారుతోంది. కొరాపుట్ జిల్లాలో గ్రామీణ ప్రాంత ప్రజలకు రక్షిత తాగునీరు లభించటం లేదుగాని నాటుసారా, కల్తీ విదేశీ మద్యం లభించని గ్రామం లేదంటే అతిశయోక్తి కాదు. అబ్కారీ సిబ్బంది ఎన్ని దాడులు జరిపి ఎంత మందిని అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టుతున్నప్పటికీ అక్రమ మద్యం వ్యాపారం ఆగడం లేదు. ఈ పరిస్థితిలో కొరాపుట్ జిల్లా అబ్కారీ ఉన్నతాధికారి అరుణ కుమార్ పాఢీ సారా ప్రవాహాన్ని అరికట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఉన్నతాధికారి ఆదేశంతో నందపూర్ అబ్కారీ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ రథ్ నేతృత్వంలో జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ అబ్కారీ అధికారి భగవాన్ మహానందియ అతని సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు వివిధ ప్రాంతాల్లో ముమ్మరంగా దాడులు జరుపుతున్నారు. ఇందులో భాగంగా గురువారం నాటు సారా, సొలప కల్లుతో పాటు కల్తీ విదేశీ మద్యం, బీరులను పట్టుకున్నట్లు బొయిపరిగుడ అబ్కారీ అధికారి భగవాన్ మహానందియ శుక్రవారం వెల్లడించారు. టీమ్ బొయిపరిగుడ సమితి చంద్రగండిగుడ బాలిగాం గ్రామాల ప్రాంతంలో చట్ట వ్యతిరేకంగా నకిలీ విదేశీ మద్యం అమ్ముతున్నారని సమాచారం అందడంతో వెంటనే తాము చంద్రఘండిగుడ గ్రామానికి వెళ్లి ఆ గ్రామంలో లుకునాథ్ బిశాయి ఇంటిపై దాడి చేయడంతో అమ్మేందుకు ఉంచబడిన 2.160 లీటర్ల నకిలీ విదేశీ మద్యంతో పాటు 6.600 లీటర్ల నకిలీ బీర్‌ను సీజ్ చేసినట్లు వెల్లడించారు. అలాగే ఆ గ్రామంలో బినోద్ బిశాయి ఇంటిపై దాడి జరిపి 30 లీటర్ల సొలప కల్లు, తొమ్మిది లీటర్ల నాటు సారా సీజ్ చేసినట్లు వెల్లడించారు. వాటితో పాటు బలిగాం గ్రామం సుభాష్ డాకువ ఇంట్లో దాచి ఉంచిన 2.340 లీటర్ల నకిలీ విదేశీ మద్యంతో పాటు 25.650 లీటర్ల బీర్‌లను పట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ సంఘటనలలో నలుగురిని అరెస్టు చేసినట్లు అబ్కారీ అధికారి భగవాన్ మహానందియ వెల్లడించారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ కార్యాలయంలో దొంగలు


దొంగలు పడిన ఉమ్మర్ కోట్ తహసీల్దార్ కార్యాలయం

కొరాపుట్: శుక్రవారం ఉదయం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ పట్టణంలో ప్రభుత్వ తహసీల్దార్ కార్యాలయంలో దొంగతనం జరిగింది. దొంగలు కార్యాలయంలోకి ప్రవేశించి ట్రెజరీ బీరువా పగలు కొట్టడానికి ప్రయత్నం చేసి విఫలమయ్యారు. వెళ్లేటప్పుడు సీసీ కెమెరా ఫుటేజీ ఉన్న డీవీఆర్ తీసుకెళ్లిపోయారు. ఈ కార్యాలయం పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే ఉండడం గమనార్హం.

బైక్ అదుపు తప్పి యువకుడు మృతి


సంఘటన స్థలంలో మృతదేహం

కొరాపుట్: బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందాడు. శుక్రవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రం నుంచి కొసాగుమడ వెళ్లే మార్గంలో బెహరా గుడి వద్ద బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కుసిమి గ్రామానికి చెందిన ఖగుపతి పూజారి (25) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే బైక్ మీద ఉన్న మరో వ్యక్తి రూపు బొత్ర తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ప్రజలు ఈ సమాచారం పోలీసులకు అందించారు. వెంటనే బాధితుడిని నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాకంబరిగా..


జయపూర్ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శాకంబరిగా అమ్మవారు

కొరాపుట్: కన్యకా పరమేశ్వరి అమ్మవారు శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. శుక్రవారం జయపూర్ పట్టణంలోని మహారాణీ పేటలో గల వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఏటా ఆషాడ మాసంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే అమ్మవారికి ధాన్యంతో అభిషేకం నిర్వహించారు.

బూరగాంలో కలకలం

టెక్కలి : బూరగాం గ్రామంలో శుక్రవారం కలకలం రేగింది. ఓ ఇంటికి నిత్యం కొంతమంది యువతీ యువకులు వస్తూ పోతుంటారని, ఓ మహిళ చీకటి వ్యవహారం నిర్వహిస్తోందంటూ స్థానికులు ఇంటికి ఇరువైపులా తాళాలు వేసి నిర్బంధించారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్‌ఐ కేశవరావు, సిబ్బంది గ్రామానికి చేరుకుని మహిళతో పాటు ఇంట్లో నిర్బంధించిన ముగ్గురు యువకులు, ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, గ్రామస్తులు నిర్బంధించిన వారంతా తనకు తెలిసినవారేనని ఆ మహిళ చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కాశీబుగ్గలో ఎస్పీ గ్రీవెన్స్


సమస్య వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించారు. బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి, కొట్లాట, మిస్సింగ్, చీటింగ్ తదితర అంశాలపై ఫిర్యాదులు స్వీకరించారు.

ఒడిశాను అదానీ నడిపిస్తున్నాడు: రాహుల్

భువనేశ్వర్:

'రాజ్యాంగాన్ని కాపాడదాం' నినాదంతో రాహుల్ గాంధీ రాష్ట్ర పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక బారముండా మైదానంలో భారీ బహిరంగ సభని ఉద్దేశించి రాహుల్ ప్రసంగించారు. ఆయనతో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఖర్గే పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతు రాష్ట్రంలో ప్రజా దోపిడీ ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. ఒడిశాను అదానీ నడిపిస్తున్నాడని ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ దేశ వ్యాప్తంగా రాజ్యాంగ విలువల్ని నిలువునా నీరు గార్చుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

'నీరు, అడవి, భూమి గిరిజనులకే చెందుతాయి. ఇక్కడ గిరిజనులకు వారి భూమి పట్టాలు ఇవ్వడం లేదు. ఇది ప్రజల ప్రభుత్వం కాదు. ఇది కోటీశ్వరుల ప్రభుత్వం. ప్రజల రక్తాన్ని పీల్చేస్తున్న ప్రభుత్వం 'గా వ్యాఖ్యానించారు. అణగారిన వర్గాలకు అండగా కాంగ్రెస్ నిలబడుతుందన్నారు. ముందస్తు సంప్రదింపులు లేకుండా గిరిజనులను బలవంతంగా తరలించి భూమి హక్కులను తిరస్కరించడాన్ని తీవ్రంగా ఖండించారు. పెసా అమలు అణగదొక్కి ఈ వర్గపు ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని తెలిపారు. నిజమైన యాజమాన్యాన్ని పునరుద్ధరించడానికి పెసా చట్టం, గిరిజన బిల్లును కాంగ్రెస్ అమలు చేస్తుందని హామీ ఇచ్చింది. ఎన్నికల సమగ్రతను కాపాడటానికి కాంగ్రెస్ నిర్విరామంగా ఉద్యమిస్తుంది. ఎన్నికల సంఘం అధికార భారతీయ జనతా పార్టీ ఏజెంట్‌గా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో ఒక కోటి మంది బూటకపు ఓటర్ల ఆవిష్కరణ దీనికి నిలువెత్తు తార్కాణంగా పేర్కొన్నారు. బీహార్‌లో ఫలితాలను తారుమారు చేయడానికి ఇలాంటి కుట్రలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఎన్నికలను హైజాక్ చేయడానికి చేసే ప్రతి ప్రయత్నాన్ని కాంగ్రెస్ ప్రతిఘటిస్తుందని సభాముఖంగా ప్రకటించారు.



రాజ్యాంగాన్ని కాపాడదాం బహిరంగ సభలో రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ప్రసంగం

మహిళలకు కాంగ్రెస్ అండగా నిలబడుతుందన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత పూర్తిగా లోపించిందని, 40 వేల మందికి పైగా మహిళలు అదృశ్యం కావడం దిగ్భ్రాంతికరమైన అంశంగా పేర్కొన్నారు. ఈ దుస్థితి పట్ల రాష్ట్ర ప్రభుత్వం పెదవి కదపకుండా చోద్యం చూస్తుందన్నారు. రాష్ట్రంలో రోజుకు సగటున 15 మంది మహిళలు అత్యాచారానికి గురవుతున్నట్లు తాజా విశ్లేషణలు తేల్చడం పట్ల విచారం వ్యక్తం చేశారు.

అదానీ కోసం శ్రీ జగన్నాథుని రథం నిలిపి వేశారని ఆరోపించారు. ఒడిశాను అదానీ నడిపిస్తున్నాడు అని బహిరంగంగా దుయ్యబట్టారు. ఇటీవల ముగిసిన పూరీ శ్రీ జగన్నాథుని పవిత్ర రథయాత్ర సమయంలో ఆచార, సంప్రదాయ విరుద్ధమైన సంఘటనలు చోటు చేసుకోవడం అపచారంగా పేర్కొన్నారు. అదానీ కుటుంబానికి అనుకూలంగా రథాలను నిలిపి వేశారని ఆరోపించారు. ఇక్కడి ప్రభుత్వం ప్రజల కంటే కోటీశ్వరులకు సేవ చేస్తోందనేందుకు ఇదో ఉదాహరణగా పేర్కొన్నారు. పేదలు, గిరిజనులు, దళితులు, రైతులు మరియు కార్మికులకు అండగా నిలిచేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ధైర్య సింహాలుగా అహర్నిశలు కృషి చేస్తారని హామీ ఇచ్చారు.

సొమ్ము ఒకడిది, సోకు ఒకడిది: మల్లికార్జున్ ఖర్గే

అధికారంలోకి వచ్చిన తర్వాత భారతీయ జనతా పార్టీ కొత్తగా సాధించిది ఏమీ లేదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించిన ప్రయజనాత్మక ఫలితాలతో పబ్బం గడుపుకుంటోందని అఖిల భారత కాంగ్రెస్ కమిటి (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రసంగంలో పేర్కొన్నారు. భువనేశ్వర్‌ను రాజధానిగా అప్పటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆవిష్కరించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఒడిశాలో, కేంద్రంలో ఉన్న కాలంలో రాష్ట్రం పారిశ్రామిక, ఆర్థిక, వాణిజ్య, రవాణా, విద్య, ఆరోగ్యం తదితర రంగాల్లో స్థిరపరచిన వ్యవస్థతతో బీజేపీ చెలామణి అవుతోందన్నారు. రాష్ట్రంలో పారాదీప్ పోర్టు, రౌర్కెలా స్టీల్ ప్లాంట్, హిరాకుడ్ జలాశయం, నాల్కో, ఎన్‌టీపీసీ, మంచేశ్వర్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, చిలికా నావల్ కోచ్‌లతదితర ప్రముఖ వ్యవస్థలు కాంగ్రెస్ ఏర్పాటు చేసినవిగా పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ఒడిశా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు.

గట్టి బందోబస్తు

రాహుల్ గాంధీ పర్యటన పురస్కరించుకుని గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సమగ్రంగా 53 ప్లాటూన్ల పోలీసు బలగాలతో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలను మోహరించారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి బరముండా స్క్వేర్, కాంగ్రెస్ భవన్,మే ఫెయిర్ హోటల్ వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. 4 మంది డీసీపీ హోదా అధికారులు, 10 మంది అదనపు డీసీపీలు, 24 మంది ఏసీపీలు, 34 మంది ఇనస్పెక్టరు ఇంచార్జిలు, 70 మంది ఇతర సీనియర్ పోలీసు సిబ్బందిని మోహరించారు.

బోల్‌భం యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు

జయపురం: శ్రావణ మాసంలో పలు ప్రాంతాల నుంచి గుప్తేశ్వర్ శివ క్షేత్రానికి వేలాది మంది బోల్‌భం భక్తులు వస్తారు. దీంతో గుప్తేశ్వర్‌లో బోల్‌భం భక్తులకు తగిన సౌకర్యాలు సమకూర్చే విషయమై చర్చిందేందుకు జయపురం సబ్‌కలెక్టర్ కార్యాలయ సభాగృహంలో శుక్రవారం అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. సబ్‌కలెక్టర్ కుమారి అక్కవరం శొశ్యారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశం శ్రావణ మాసం ప్రథమ సోమవారం నుంచి బోల్‌భం కావిడి దారులు వేలాది మంది వస్తారని, అందుచేత వారు ఎలా శాంతిగా, సురక్షతంగా బాబా గుప్తేశ్వర్‌లో మహాశివుడుని దర్శించుకొనేందుకు చేపట్టవలసిన జాగ్రత్తలపై సమావేశంలో చర్చించారు. అలాగే శివలింగంపై భక్తులు జలాభిషేకం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. గుప్తేశ్వర్‌లో నీటి సమస్య తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలని సబ్‌కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే డయేరియా, అతిసార వ్యాధులు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెండు రోజుల్లో గుప్తేశ్వర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నరు. గుప్తేశ్వర్‌లో పారిశుధ్య పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని, బోల్‌భం భక్తులు శివలింగాన్ని దర్శించుకొనేందుకు క్యూలైన్లను ఏర్పాటు చేయాలని సబ్‌కలెక్టర్ జయపురం తహసీల్దార్ స్నిగ్ధ రాణి చౌధురి ఆదేశించారు. సమావేశంలో జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి పార్థ కాశ్యప్, బొయిపరిగుడ ఇన్‌చార్జి బీడీవో శక్తి మహాపాత్రో, దేవదాయ విభాగ అధికారి చిత్తరంజన్ పట్నాయక్, బొయిపరిగుడ పోలీసు అధికారి లక్ష్మీరంజన్ ప్రధాన్, అగ్నిమాపక విభాగ అధికారి సురేష్ బారిక్,రామగిరి పోలీసు పంటి అధికారి విష్ణు ప్రసాద్ మడకాని, రెవెన్యూ అధికారి హరిహర శతపతి, దిలీప్ ప్రధాన్లతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో సబ్‌కలెక్టర్, ఎస్‌డీపీవోలు


గుడిసెలు కూల్చివేస్తున్న అధికారులు


కూలిపోయిన పూరి గుడిసెలు

అక్రమ నివాసాలు కూల్చివేత

కొరాపుట్: జయపూర్ పట్టణంలోని జాతీయ రహదారి 26పై లేబర్ ఆఫీస్ జంక్షన్ సమీపంలో బాపూజీ నగర్ ప్రాంతంలో ఉన్న సంచార జాతుల అక్రమ నివాసాలు అధికారులు కూల్చివేశారు. సాధారణంగా సంచార జాతులు కొద్దిరోజులు ఒక్కొక్క ప్రాంతంలో ఉండి తిరిగి వెళ్లిపోతుంటారు. కానీ ఈ బృందం కొన్ని సంవత్సరాలు ఈ స్థలంలోనే ఉండిపోయింది. చివరకు ఇది ఆక్రమణకి గురవుతుందని అధికారులు గుర్తించారు. దీంతో జేసీబీలు తెప్పించి మొత్తం అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: విద్యార్థులు చదువుతో పాటు నిర్వహించే వివిధ పోటీల్లో పాల్గొంటే వారిలో నూతనోత్సాహం పెరుగుతుందని, చదువుపై శ్రద్ధ కలుగుతుందని ఏడీఎం రమేష్‌చంద్ర నాయక్ అన్నారు. స్థానిక సంస్కృతి భవనంలో ఒడిశా సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థుల మధ్య వ్యాస, వక్తృత్వ, పొయిట్రీ, జీకే పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాయక్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ మాట్లాడుతూ.. జిల్లాలోని 11 సమితుల నుంచి 88 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని అన్నారు. గెలుపొందిన విద్యార్థులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ చంద్ర నాహక్, జిల్లా సంస్కృతి విభాగం అధికారి సుస్మిత బౌరి పాల్గొన్నారు. విజేతలకు ముఖ్యఅతిథి.. ఏడీఎం నాయక్ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏడీఎం నాయక్

పర్యాటక స్థూపంగా పైలాన్


పైలాన్ వద్ద పనులు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: ప్రజా సంకల్పయాత్ర సందర్భంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన పైలాన్‌ను పర్యాటక స్థూపంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. వైఎస్ జగన్ పాదయాత్ర సందర్భంగా 2017లో లొద్దపుట్టిలో విజయ స్థూపాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుతం పైలాన్ శిథిలావస్థకు చేరుకోవడంతో శుక్రవారం ఎమ్మెల్సీ నర్తు రామారావు తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాదయాత్రకు చిహ్నంగా ఉండే పైలాన్‌ను ప్రతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్త మదిలో చిరస్థాయిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కారంగి త్రినాథ్, ఆశి దాలయ్యరెడ్డి, పిలక సంతు, ఉప్పాడ రాజారెడ్డి, సైనా తేజా, తులసీ, తిప్పన ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో విజిలెన్స్ విచారణ


ఆలయంలో జగన్మోహనరావు సమక్షంలో వాంగ్మూలాలను రికార్డు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రూ.లక్షల్లో అక్రమాలు చేసినట్లుగా అందిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం విజిలెన్స్ సిబ్బంది విచారణ చేపట్టారు. విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు ఆదేశాల మేరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురి నుంచి వాంగ్మూలాలను స్వీకరించారు. దాదాపుగా రూ.2 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు సమాచారం. భక్తుల దర్శనాల ఏర్పాట్లు, సౌకర్యాలు, ఆలయంలో వివిధ రకాల అభివృద్ధి పనుల పేరిట రూ.లక్షల్లో అక్రమంగా చెక్కులను జారీ చేస్తూ.. ఆలయ నిధులను దారుణంగా తినేశారని విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

రెగ్యులర్ ఉద్యోగులే టార్గెట్‌గా..

విశాఖపట్నంలో గ్రేడ్-2 ఈవోగా రిటైర్డ్ అయిన జగన్మోహనరావుతో పాటు ఆలయ రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్ కావ్యశ్రీల ప్రమేయంతో రెగ్యులర్ ఉద్యోగుల పేరిట అక్రమంగా చెక్కులు జారీ అయ్యాయని గుర్తించారు. ఎర్రయ్య అనే అటెండర్‌కు తెలియకుండా ఆయన పేరుతో రూ.5 లక్షల విలువైన చెక్కులు, మరో రెగ్యులర్ రికార్డు అసిస్టెంట్ శిమ్మ మల్లేశ్వరరావు పేరిట 19 చెక్కులు, అటెండర్ శ్రీనివాసరావు పేరుతో సుమారు 4 చెక్కులు, స్వీపర్ నీలయ్య పేరుతో 2 చెక్కులతో పాటు ఆలయంలో సిమ్మెంట్ పనులు చేసే మేస్త్రి కునుకు రాము అనే వ్యక్తి పేరిట ఏకంగా 9 చెక్కులు, దినసరి పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్న బుజ్జి పేరిట మరో 4 చెక్కుల వరకు జారీ చేసేశారు. ఆయా రెగ్యులర్ ఉద్యోగుల సంతకాలు కూడా ఫోర్జరీవిగా పేర్కొంటున్నారు. దీంతో పాటు ఆలయంలో విద్యుత్‌తో పాటు పలు రకాల పనులను కాంట్రాక్ట్ విధానంలో చేస్తున్న క్లాస్-1 కాంట్రాక్టర్ ఉంగటి పాపారావు వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశారు. మిగిలిన చెక్కులన్నీ ప్రైవేటు వ్యక్తులు, వ్యాపారుల పేరుతో జారీ చేశారు.

వివాదాస్పదంగా వాంగ్మూలాల స్వీకరణ..


విజిలెన్స్ అధికార సిబ్బంది.. తమ జిల్లా కార్యాలయంలో వాంగ్మూలాలను స్వీకరించకుండా ఆలయ కార్యాలయంలో కూర్చుని వాంగ్మూలాలను దగ్గరుండి రాయించడం వివాదాస్పదమయ్యింది. అక్రమాలు చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను ముందున కూర్చోబెట్టుకుంటే వాస్తవాలను ఎలా చెప్పగలమని కొందరు దినసరి వేతన దారులు ఆక్షేపించారు. ఇప్పటికైనా విజిలెన్స్ ఉన్నతాధికారులు తమదైన శైలిలో విచారించి ఆలయంలో అక్రమాల నిగ్గు తేల్చాలని పలువురు కోరుతున్నారు.

బదిలీ టీచర్లకు జీతాలు ఎప్పుడిస్తారు?

శ్రీకాకుళం: జూన్‌లో జరిగిన రీ ఎపోర్షన్, ప్రమోషన్లు, బదిలీ కౌన్సిలింగ్ కారణంగా కొత్త పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులలో కొందరికీ ప్రభుత్వ ఆమోదం పొందని కారణంగా జూన్ జీతాలు చెల్లించలేదని, వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ శుక్రవారం డిమాండ్ చేశారు. జీతాలు వేయకపోవడంతో మినహాయింపులు, బ్యాంకులకు చెల్లించాల్సిన ప్రీమియంలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి నూతన క్యాడర్ స్ట్రెంత్‌ను ఆమోదించి జీతాలు చెల్లించాలని కోరారు. విద్యా రంగంలో అనవసర ప్రయోగాలు, బోధనేతర కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వకుండా విద్యాబోధనపై దృష్టి పెట్టేలా కృషి చేయాలన్నారు.

గ్యాస్ లీకై ఇద్దరికి గాయాలు

ఆమదాలవలస: పురపాలక సంఘ పరిధిలోని మెట్టక్కివలస పదో వార్డు వాంబే కాలనీలో గ్యాస్ లీకై ఇద్దరు గాయాల పాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. వాంబే కాలనీకి చెందిన గుంటుకు సరస్వతి టిఫిన్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంట్లో టిఫిన్ తయారు చేస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎదురు ఇంట్లో నివసిస్తున్న కోలా మాధవరావు ఘటనా స్థలానికి వెళ్లి మంటలు ఆర్పడానికి ప్రయత్నించగా ఆయన కూడా గాయాల పాలయ్యాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రూ.70 వేల నష్టం జరిగినట్లు సమాచారం. ఎస్సై ఎస్.బాలరాజు సైతం ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. గ్యాస్ సిబ్బంది పరిశీలించి బాధితురాలితో మాట్లాడారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.


ప్రమాదానికి గురైన ఇల్లు

గండం గడిచింది!

- నడిసంద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు
- బోటులో నీరు చేరడంతో దిక్కుతోచని పరిస్థితి
- మెరైన్, పోలీసులకు తెలియజేసినా కానరాని స్పందన
- మరో బోటు రావడంతో సురక్షితంగా ఒడ్డుకు..

ఎచ్చెర్ల: నడిసంద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు ప్రాణభయంతో విలవిల్లాడిపోయారు. సాయం కోసం మెరైన్, పోలీసులను ఆశ్రయించినా స్పందన లేకపోవడంతో ప్రాణాలపై ఆశలు వదులుకున్నారు. ఈ సమయంలో మరో బోటు రావడంతో సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ఘటన ఎచ్చెర్ల మండలం కొయ్యాం సముద్ర తీరానికి సుమారు 45 మైళ్ల దూరంలో చోటుచేసుకుంది. బాధిత మత్స్యకారులు, బోటు యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లాకు చెందిన పది మంది మత్స్యకారులు ఈ నెల 9న ఉదయం 5 గంటలకు సముద్రంలో వేటకోసం బయల్దేరారు. ఎచ్చెర్ల మండలంకొయ్యాంకు 45 మైళ్ల దూరంలో ఉండగా బోటు చెక్క పక్కకు ఒరిగిపోవడంతో లోపలికి నీరు ప్రవేశించింది. కొద్దికొద్దిగా బోటు మునిగిపోయే సూచనలు కనిపించాయి. దీంతో బోటులో ఉన్న వారు వారి యజమాని వాసపల్లి ధనారాజ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన మెరైన్ సిబ్బంది, పోలీసులకు, వేరే బోటు నిర్వాహకులకు ఫోన్‌లు చేసినా ఫలితం లేకపోయింది. ఆ సమయంలో మరో బోటు రావడంతో వారిని సాయం అడిగారు. వారు తొలుత సహకరించకపోవడంతో వలకు అడ్డుగా బోటును నిలబెట్టడంతో సాయం చేసేందుకు అంగీకరించారు. పది మంది మత్స్యకారులు ఆ బోటులోకి వెళ్లిపోయారు. 10వ తేదీ మొత్తం ఆ బోటు లోనే గడిపారు. 11వ తేదీ ఉదయం కొయ్యాం తీరానికి చేరుకున్నారు. అప్పటికే యజమాని వచ్చి ఆటోలో మత్స్యకారులను విశాఖకు తీసుకెళ్లిపోయారు. ఈ ఘటనలో సుమారు 90 లక్షల విలువైన బోటు మునిగిపోయిందని యజమాని తెలిపారు.


సురక్షితంగా బయటపడి మత్స్యకారులు

చనిపోతే వస్తామన్నారు..

అంతకుముందు బోటు యాజమాని వాసపల్లి ధనరాజ్ మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు సాయం అందించాలని మెరైన్ సిబ్బందికి తెలియజేశాం. ఎవరూ స్పందించలేదు. అనంతరం ఎచ్చెర్ల పోలీసులకు ఫోన్ చేస్తే ఎవరైనా చనిపోతే అప్పుడు వస్తామని బదులిచ్చారని, సముద్రంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకోకపోవడం అన్యాయమని అన్నారు.

క్లుప్తంగా

వైభవంగా సహస్ర దీపాలంకరణ



దీప కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనుల పండువగా జరిపించారు. వెండి మంటపంలో ఉన్న శ్రీ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో వేంచేపుజేశారు. అనంతరం దీపాలను వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర దీప కాంతుల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

డీపీఓలో పోలీస్ వెల్ఫేర్ డే



సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి విజ్ఞాపనలు స్వీకరించి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేసి వారి సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తానన్నారు. పోలీసు వెల్ఫేర్ డేలో భాగంగా సిబ్బంది ఒక్కొక్కరిని తన చాంబర్‌లోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకుని వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు.

బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలవాలి



రాష్ట్రస్థాయి పోటీలకు పయనమైన జిల్లా బాక్సర్లు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల బాలికల బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు విజయం సాధించాలని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు. అవనాపు భార్గవి ఆకాంక్షించారు. ఈనెల 12, 13వ తేదీల్లో విశాఖపట్నం రైల్వే స్టేడియంలో జరిగే 6 వ రాష్ట్ర సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు శుక్రవారం పయనమయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సెల్ దొంగకు దేహశుద్ధి



సెల్‌ఫోన్ దొంగకు దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

రామభద్రపురం: మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఆగి ఉన్న బస్‌లో ఓ వ్యక్తి నుంచి సెల్ దొంగలించి పారిపోతున్న యువకుడిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఒడిశా రాష్ట్రానికి చెందిన బస్ ఆగి ఉంది. బస్సులోని ఓ వ్యక్తి దగ్గర నుంచి ఇద్దరు యువకులు సెల్ దొంగలించి కిందికి దిగి ఇద్దరూ చెరోవైపు పారిపోతున్నారు. ఇంతలో స్థానికులు వెంబడించి ఒక యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు.సెల్ పట్టుకుని పారిపోయిన యువకుడు తప్పించుకున్నాడు. దొరికిన యువకుడిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు. వారిద్దరు అనకాపల్లికి చెందిన వారుగా తెలిసింది.

పుస్తెల తాడు చోరీ

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి గుండాలపేటలో శుక్రవారం చోరీ జరిగింది. సత్యవతి అనే మహిళ తన పొలంలో వరి ఊడ్పు పని చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి అకస్మాత్తుగా వచ్చి ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడును లాక్కుని పారిపోయినట్లు బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రూరల్ ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అన్నీ రిఫరల్ కేసులేనా..!

- రోగుల రిఫర్‌పై వైద్యులు, అధికారుల వాదన
- సీరియస్ లేకున్నా జిల్లా కేంద్రానికి రిఫర్ చేస్తున్నారు
- 108 జిల్లా మేనేజర్
- రోగికి బాగుందా లేదా అన్నది మేం డిసైడ్ చేస్తాం
- సీహెచ్‌సీ సూపరింటెండెంట్



వాదులాడుకుంటున్న సూపరింటెండెంట్, 108 మేనేజర్

బొబ్బిలి: మూడు జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా బొబ్బిలి సీహెచ్‌సీ నుంచే జిల్లాకేంద్రానికి రోగులను రిఫర్ చేస్తున్నారని, ఇక్కడి వైద్యులకు ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నందున సీహెచ్‌సీకి వచ్చిన రోగులను ఐపీలో ఉంచేందుకు ఇష్టపడక చిన్న రోగానికి కూడా రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో వాటికి మరింత బలం చేకూర్చే విధంగా శుక్రవారం ఓ సంఘటన జరిగింది. ఏకంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి శశిభూషణ రావు, వైద్యులు 108 మూడు జిల్లాల మేనేజర్‌ల మధ్య చాలా సేపు వాగ్వాదం జరిగింది. ప్రతి చిన్న విషయానికి 108కి ఫోన్ చేసి రమ్మంటున్నారని, రోగులు నడిచి వెళ్లగలిగే పరిస్థితుల్లోనూ 108 వాహనాన్ని పిలిచి రోగులను తరలించడం వల్ల వివిధ రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆయా ప్రాంతాలకు 108 వాహనాలను పంపించలేకపోతున్నామని 108 మేనేజర్ మన్మథ రావు అన్నారు. దీనికి ఆస్పత్రి సూపరింటెండెంట్ జి శశిభూషణ రావు మాట్లాడుతూ రోగులను 108లో పంపించాలా? మామూలుగా ఇక్కడే వైద్యం చేయించాలా అన్న విషయాన్ని నిర్ణయించేది మేము. మీరెలా చెప్పగలరు? అని ఎదురు ప్రశ్నించారు. రోగి స్థితి ఒక్కోసారి ఒక్కోలా ఉంటుందని, నిలకడగా ఉండదని అలాంటప్పుడు మేం ఎలా రిఫర్‌చేయకుండా ఉంచుతామన్నారు. మీరు ఒక వేళ 108 పంపించలేమని అనుకుంటే మాకు రాసిచ్చేయండి. మేం ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. పోర్టికో వద్ద జరుగుతున్న ఈ వాదనను రోగులు, ఇతర వైద్యసిబ్బంది వచ్చి చూస్తూ ఉండిపోయారు. మరో వైద్యురాలు మాట్లాడుతూ మీరు వాహనాలు పంపించేందుకు ఇష్టపడకపోతే ఎలా మేం రిఫర్ రాస్తాం. అలాంటప్పుడు రోగికి ఏదైనా జరిగితే మీదే బాధ్యత అని అన్నారు. ఒక్కో అంబులెన్స్ డ్రైవర్ చాలా రెక్‌లెస్‌గా మాట్లాడుతున్నారని ఆమె ఆరోపించారు.

కంప్లైంట్ ఇవ్వండి

ఇక్కడ ఆస్పత్రిలో వైద్యులు రోగులను ఉంచడం లేదు. అందర్నీ రిఫర్ చేస్తున్నారని మీరు కంప్లైంట్ ఇవ్వండి మా కంప్లైంట్ మేం ఇచ్చుకుంటామని సూపరింటెండెంట్ శశిభూషణ రావు అన్నారు. చాలా కేసులకు విజయనగరం వెళ్లి వస్తున్నామని, జిల్లా కేంద్రానికి వెళ్లి వచ్చేసరికి దాదాపు 6 గంటలు పడుతోందని ఈ లోగా ఏమైనా ఏక్సిడెంట్‌లు జరిగితే అందుబాటులో ఉండలేకపోతున్నామని 108 మేనేజర్ మన్మథ రావు అన్నారు. రోగుల వైద్యం కోసం ఇలా వాదులాడుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

టోల్‌గేట్ వేయింగ్ మిషన్ వద్ద అక్రమ వసూళ్లు

- నిర్వాహకులను నిలదీసిన లారీ యజమానులు, సిబ్బంది



టోల్‌గేట్ వేయింగ్ మిషన్ వద్ద నిర్వాహకులను నిలదీస్తున్న లారీ యజమానుల సంఘం ప్రతినిధులు

డెంకాడ: మండలంలోని నాతవలస టోల్‌గేట్ వద్ద ఉన్న వేయింగ్ మిషన్ పని చేయకపోయినా ఇష్టం వచ్చినట్లు వాహనాల వద్ద అధిక బరువు పేరుతో డబ్బులు అక్రమంగా వసూలు చేస్తున్నారని లారీ యజమానులు, సిబ్బంది వేయింగ్ మిషన్ నిర్వాహకులను నిలదీశారు. అధిక బరువుతో వెళ్తున్న వాహనాలు ఎంత మేరకు అధిక బరువుతో ఉన్నది వేయింగ్ మిషన్ ద్వారా వాహన యజమానులకు తెలుస్తుంది. అయితే వేయింగ్ మిషన్ పని చేయకపోయినా వారికి నచ్చినంత అధిక బరువు పేరుతో నిర్వాహకులు డబ్బులు తీసుకుంటున్నారని లారీ యజమానులు, సిబ్బంది చెప్పారు. వేయింగ్ మిషన్ పని చేయకపోయినా ఎలా అధిక బరువు ఎలా వసూలు చేస్తారని నిలదీశారు. కొంతకాలంగా ఇది జరుగుతోందని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. నిర్వాహకులు, లారీ యజమానుల మధ్య వివాదం చివరకు పోలీసుల వద్దకు చేరింది. ఈ మేరకు భోగాపురం సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో వివాదంపై చర్చలు జరిగాయి. లారీ యజమానుల తరఫున లారీ ఓనర్ల అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహారథి,సెక్రటరీ శేషగిరి, ట్రెజరర్ వీవీ రాజు తదితరులు హాజరవగా, నిర్వాహకులు తరఫున కొందరు హాజరయ్యారు. వేయింగ్ మిషన్ బాగు చేసే వరకూ అధిక లోడ్ చార్జీలు వసూలు చేయరాదని నిర్వాహకులను అధికారులు ఆదేశించారు. తూనికలు, కొలతల శాఖ నుంచి అధికారులు పనిచేయని వేయింగ్ మిషన్‌ను పరిశీలించారు.

గర్భిణుల ఆరోగ్యం పట్ల అప్రమత్తం



గర్భిణి వైద్యపరీక్షల రికార్డును పరిశీలిస్తున్న డాక్టర్ పి.ఉషారాణి

సీతానగరం: మండలంలోని గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలని పీహెచ్‌సీ డాక్టర్ పి.ఉషారాణి అన్నారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ మేరకు డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ గర్భిణుల్లో ఎక్కువ మందికి రక్తహీనత (హిమోగ్లోబిన్) ఉన్నట్లు గుర్తించామన్నారు. రక్తహీనత నివారణకు ఐరన్ సుక్రోజ్ మందులు ఇవ్వనున్నామని, ఐరన్ లోపాన్ని అధిగమించడానికి ఐసీడీఎస్ శాఖ అంగన్వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పాలు, గుడ్లు, చక్కీలు విధిగా తీసుకోవాలని కోరారు. అలాగే ప్రతి నెలా పీహెచ్‌సీల్లో గర్భిణులకు తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవ సమయానికి గర్భిణులందరూ చేరాలని కోరారు. అలాగే సీజనల్ వ్యాధులు వస్తున్న కారణంగా వైద్యసిబ్బంది అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియ జేశారు. పీహెచ్‌సీ ఓపీలో రోజుకు 65 నుంచి 80 మంది రోగులకు సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం

సాలూరు: టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు పట్టణంలోని 1,29 వార్డుల్లో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ -అబద్ధాలు గ్యారెంటీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తోందో గడపగడపకు వెళ్లి వివరించారు. మహిళలకు ఉచిత బస్సు,ఆడబిడ్డ నిధి, నిరుద్యోగభృతి తదితర సూపర్‌సిక్స్ పథకాల హామీలు అమలు చేయకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు గిరిరఘు, రౌతు అప్పారావు, గొర్లె వెంకటరమణ, రంగా, చిన్ని, హరిబాలాజీ, రామకృష్ణ, లక్ష్మణరావు, రామారావు, వాసు , వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

200 కేజీల గంజాయి స్వాధీనం...?

దత్తిరాజేరు: మండలంలోని పెద్దమానాపురం సమీపంలో కొంత మంది వ్యక్తుల దగ్గర 200 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం తెలిసింది. గంజాయి తరలిస్తున్న వారిలో ఇద్దరు వ్యక్తులు పోలీసులకు దొరకగా మరి కొంతమంది తప్పించుకుని పారిపోవడంతో వారిని పట్టుకునే పనిలో పెదమానాపురం పోలీసులు ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై తెలుసుకునేందుకు ఎస్సై ఆర్ జయంతికి ఫోన్ చేయగా ఆమె స్పందించ లేదు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

- మరో యువకుడికి తీవ్రగాయాలు



మృతుడు శ్రీను (ఫైల్)



శ్రీను మృతదేహం

కొత్తవలస: అరకు–విశాఖపట్నం జాతీయ రహదారిలో శుక్రవారం రాత్రి స్కూటీపై వెళ్తున్న యువకులను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో లక్కవరపుకోట మండలం భూమిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన మాదాబత్తుల శ్రీను(23) అక్కడికక్కడే మృతి చెందగా అదే గ్రామానికి చెందిన ధనాలకోటి అప్పలనాయుడు తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, ఎస్సై హేమంత్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీను తన స్వంత గ్రామం భూమిరెడ్డిపాలెం నుంచి స్నేహితుడు అప్పలనాయుడితో కలిసి స్కూటీపై పెందుర్తి మండలంలో గల తన అక్క ఇంటికి బయల్దేరాడు. అరకు–విశాఖ రోడ్డు మంగళపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా మితిమీరిన వేగంతో గుర్తు తెలియిన వాహనం వచ్చి ఢీకొట్టింది. దీంతో శ్రీను రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అధికంగా రక్తస్రావం జరగ్గా అక్కడికక్కడే మృతిచెందాడు. స్కూటీ వెనుక కూర్చున్న అప్పలనాయుడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సహాయంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కాగా మృతుడు శ్రీను విశాఖపట్నం జిల్లా ఎన్‌ఏడీ జంక్షన్ సమీపంలో బాజీజంక్షన్ వద్ద గల బ్యాంక్ ఆఫ్ బరోడాలో సహాయకుడిగా పని చేస్తున్నాడు. అప్పలనాయుడు చిన్న చిన్న ఎలక్ట్రికల్ పనులను చేస్తు కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని ఎస్సై మేమంత్‌కుమార్ సిబ్బందితో కలిసి పరిశీలించి శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నలుగురు ఉపాధ్యాయులకు మెమో

సాక్షి ఎఫెక్ట్

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి మోడల్ ప్రైమరీ పాఠశాలకు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు మెమో జారీచేసినట్లు ఎంఈవో శ్యామ్‌సుందర్ శుక్రవారం తెలిపారు. సాక్షిలో శుక్రవారం 'పాపం చిన్నారులు..!' అనే కథనం ప్రచురితమైంది. పేరెంట్స్, టీచర్స్ సమావేశం మాత్రమే నిర్వహించాలి తప్ప, ఎటువంటి ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టరాదని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ, అందుకు విరుద్ధంగా ఉపాధ్యాయులు పాఠశాల ఎదుట నడిరోడ్డుపై సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించడంతోపాటు, రోడ్డుపై చిన్నారులను, తల్లిదండ్రులును కూర్చోబెట్టి పాదపూజ నిర్వహించడం సోషల్ మీడియాలో వీడియో చక్కర్లు కొట్టడంతో పలు పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. దీంతో డీఈవో రాజ్‌కుమార్ స్పందించి, నలుగురు ఉపాధ్యాయులకు మెమో ఇవ్వాలని ఎంఈవో శ్యామ్‌సుందర్‌కు ఆదేశాలు ఇవ్వడంతో, శుక్రవారం ఆ ఉపాధ్యాయులకు మెమో ఇచ్చామని, ఉపాధ్యాయుల నుంచి వివరణ రావాల్సి ఉందని ఎంఈవో శ్యామ్‌సుందర్ తెలిపారు.

కానిస్టేబుల్ అభ్యర్థి అదృశ్యం

విజయనగరం క్రైమ్: పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షలో ఫెయిల్ అయ్యానని మనస్తాపం చెందిన ఓ అభ్యర్థి అదృశ్యమయ్యాడు. నగరానికి చెందిన పల్లి పైడి నాయుడు(25) ఇటీవల పలు పోటీ పరీక్షలకు సమాయత్తం అయ్యాడు. అలాగే పోలీస్ కానిస్టేబుల్ పరీక్షకు కూడా హాజరై రాత పరీక్ష రాశాడు. అయితే రెండు రోజుల క్రితం వచ్చిన కానిస్టేబుల్ పరీక్షా ఫలితాల్లో పైడినాయుడు ఫెయిలయ్యాడు. దీంతో మనస్తాపం చెంది కన్నవారికి తాను ఇక భారం అనుకుని ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు పైడినాయుడి మామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాస్ చెప్పారు.

జిందాల్ రైతులకు చట్టప్రకారమే పరిహారం

విజయనగరం అర్బన్:

జిందాల్ కంపెనీకి భూములిచ్చి పరిహారం అందని రైతులకు వారం రోజుల్లో అందజేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిందాల్‌కు కేటాయించిన భూములపై తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఇప్పటి వరకు చెల్లించిన పరిహారం, పెండింగ్ బకాయిలపైనా ఆరా తీశారు. సుమారు 28 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి 15 మంది రైతులకు మాత్రమే పరిహారం పెండింగ్ ఉండగా వీరిలో ముగ్గురికి ఇటీవలే చెల్లించినట్లు అధికారులు వివరించారు. మిగిలిన 11 మందికి వారంలో పరిహారాన్ని అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూములు తీసుకున్న సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన పరిహారం మాత్రమే వారికి వర్తిస్తుందని స్పష్టం చేశారు. 53 బోరుబావులకు సంబంధించి ఇప్పటికే 28 మందికి నష్ట పరిహారం ఇచ్చామన్నారు. ఇళ్ల స్థలాలు కోల్పోయిన 16 మందికి నిబంధనల ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు. సమావేశంలో జేసీ ఎస్.సేతుమాధవన్, ఆర్డీఓ డి.కీర్తి, ఎస్.కోట తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, డి–సెక్షన్ సూపరింటెండెంట్ తాడ్డి గోవింద తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వచ్చిన కేంద్ర బృందం

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును సునీల్ బంట, నాతు సింగ్ ఆధ్వర్యంలోని కేంద్ర బృందం పరిశీలించింది. జిల్లాలోని బాడంగి, బొబ్బిలి, విజయనగరరం మండలాల్లో పర్యటించి పథకాల అమలుపై ఆరా తీసింది. ఎంపీడీఓలు, మండల స్థాయి అధికారులు బృందానికి సహకరించాలని కలెక్టర్ ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికే పోలీసు వెల్ఫేర్‌డే

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



పోలీస్ అధికారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పోలీస్ వెల్ఫేర్‌డే(గ్రీవెన్స్ డే) నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సిబ్బంది నుంచి విజ్ఞాపనలు స్వీకరించి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కార చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి అలాగే వృత్తి పరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన సమస్యలను పరిష్కరిం చడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా శాఖాపరమైన సిబ్బంది సమస్యలను తెలుసుకు ని పరిశీలించి సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న అంశాలపై ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సీసీ సంతోష్ కుమార్, ఆర్‌ఐ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కారులో 300 లీటర్ల సారా స్వాధీనం



పట్టుబడిన సారా, కారును చూపుతున్న సీఐ పి.శ్రీనివాసరావు, సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం)/జియ్యమ్మవలస: కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జియ్యమ్మవలస మండలం దాసరిపేట గ్రామ సమీపంలో సారా రవాణాపై రూట్ వాచ్ చేస్తుండగా ఓ కారులో తరలిస్తున్న 300 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈమేరకు తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒడిశాలోని సందుబడి గ్రామంలో తయారైన సారాను 15 క్యాన్లతో (300 లీటర్లు) టాటా ఇండికా కారులో పాలకొండ మండలం చినమంగళాపురం గ్రామానికి చెందిన వద్దాది సురేష్, జియ్యమ్మవలస మండలం చినమేరంగికి చెందిన బొత్స అనిల్‌లు తరలిస్తుండగా పట్టుబడ్డారని చెప్పారు. సారాతో పాటు కారును కూడా స్వాధీనం చేసుకుని పట్టుబడిన ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఆయన వెంట సబ్ ఇన్‌స్పెక్టర్ జె.రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల మూసివేత ప్రతిపాదనను రద్దు చేయాలి

- ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్‌కు వినతి ఇచ్చిన చింతపల్లి స్థానికులు



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలోని సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను మూసివేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనలను ఉపసంహరించుకునేలా చూడాలని చింతపల్లి స్థానికులు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును కోరారు. ఈ మేరకు కళాశాల యాజమాన్యానికి ఉత్తర్వులు జారీ అయినట్లు వారు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. 2011లో స్థానిక విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి చింతపల్లిలో సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేశారని, ఇప్పటి వరకు ఎంతో మంది విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని స్థానికులు తెలిపారు. అయితే బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం వల్ల ప్రస్తుతం ఈ పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై స్పందించిన చైర్మన్ డాక్టర్ శంకర రావు, ఏజెన్సీ ప్రాంతంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఉండాల్సిన అవసరం ఉందని ఈ విషయంలో ఎస్టీ కమిషన్ తన సిఫార్సులను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. చింతపల్లి ప్రాంతంలో వ్యవసాయ కళాశాల అవసరాన్ని గుర్తించి అప్పట్లో ఈ కళాశాల ఏర్పాటైందని, స్థానికులు లేవనెత్తిన అంశాలను పరిశీలించి కళాశాల కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు ఆయన వెల్లడించారు.

గుంటూరు, రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు



గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేస్తున్న పోలీసులు



డాగ్ స్క్వాడ్(మాక్స్) సాయంతో లగేజీలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పార్వతీపురం రూరల్: గుంటూరు, రాయగడ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలన కోసం ఈగల్ టీమ్ ఐజీ ఆకె రవికృష్ణ, ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం పేరిట శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈగల్ టీం, జిల్లా పోలీస్‌శాఖ, డాగ్‌స్క్వాడ్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించాయి. ఒడిశా నుంచి ఆంధ్రాకు గంజాయి అక్రమ రవాణాను అరికట్టే ఉద్దేశంతో ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లలో జనరల్ బోగీల నుంచి ఏసీ బోగీల వరకు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా నిర్మూలన కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1972 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నంబర్‌కు సమాచారం ఇస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

20న పారా జూనియర్స్, సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న పారా జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు రాజీవ్ క్రీడా మైదానంలో జరగనున్నాయని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్స్‌ను జిల్లా క్రీడాధికారి ఎల్. వెంకటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్‌లతో కలిసి స్థానిక అశోక్‌బంగ్లాలో ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టులో 14వ జాతీయస్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ -2025 పోటీలు జరగనున్నాయని, ఈ పోటీలకు అర్హత సాధించేందుకు ముందుగా జిల్లా స్థాయిలో ఎంపిక కావాల్సి ఉందన్నారు. 13 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు దివ్యాంగ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు ఆగస్టు 9న విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రధానంగా రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో పోటీలు నిర్వహించనున్నారని, ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న దివ్యాంగ (పారా) క్రీడాకారులంతా ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని కోరారు. క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకునేందుకు ఫోన్ 9849377577 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సారథి వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు ప్రదీప్, పారా క్రీడాకారులు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న మణి

విజయనగరం క్రైమ్: విజయనగరం టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గృహిణి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెల్లిమర్ల మండలంలోని టొంపలపేటకు చెందిన బుసకల మణి(24) కి పూసపాటిరేగ మండలం ఎరుకొండకు చెందిన సురేష్‌తో పెళ్లైంది. వారికి ఒక బిడ్డ ఉన్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో భర్త సురేష్‌కు చెప్పాపెట్టకుండా విజయనగరంలోని రాజీవ్ నగర్ కాలనీలో ఉంటున్న తన పెద్దమ్మ దగ్గరకు మూడురోజుల క్రితం మణి వచ్చేసింది. ఆ సమయంలోనే విజయనగరం టూటౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీనివాస్ ఇరువర్గాల వారిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పుడే మణి మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుని రెండురోజుల క్రితం ఎవరికీ చెప్పకుండా విజయవాడకు వెళ్లిపోయింది. దీనిపై ఆమె పెద్దమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సెల్ ఫోన్ నంబర్ ఆధారంగా ట్రేస్ చేసి విజయవాడలో ఆమెను పట్టుకుని శుక్రవారం విజయనగరం తీసుకువచ్చారు. అయితే అంతలోనే ఏం జరిగిందో ఏమోగానీ పెద్దమ్మ ఇంట్లో ఉంటున్న మణి బాత్రూమ్‌కు అని చెప్పి వెళ్లి ఇంట్లోనే ఉరేసుకుంది. ఇంట్లో ఉంటున్న పెద్దమ్మకు అనుమానం రావడంతో చూసి మణి కొనఊపిరితో ఉండడంతో చుట్టుపక్కల వారి సాయంతో హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మణి ఆత్మహత్య చేసుకుందన్న విషయం ఆమె కన్నవారికి ఎస్సై కృష్ణమూర్తి తెలియజేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.